క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మోత్కూరు : మండలంలోని అనాజీపురం గ్రామంలోని 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాజీపురం సబ్ స్టేషన్ పరిధిలోని అనాజీపురంతో పాటు దాచారం, పాడిచేడు, బుజిలాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

స్టోన్ క్రషర్‌లపై చర్య తీసుకోవాలి

బొమ్మలరామారం : ప్రభుత్వ నిబంధనలు పాటించని స్టోన్ క్రషర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల మండల మాజీ చైర్మన్ మైలారం జంగయ్య శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషనర్, లోకా యుక్తాలో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట వట్టిపల్లి సుదర్శన్, ఆశయ్య, మైలారం సుదర్శన్, పండుగ ప్రభాకర్, సుంచు యాదగిరి, మైసయ్య, ఊట్ల రమేష్, మైలారం నర్సింహ, బిట్టు శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తొలగించాలని వినతి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న బండకొత్తపల్లి గ్రామస్తులు

గుండాల : మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు శుక్రవారం విద్యుత్ శాఖ డీఈ మల్లిఖార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ తీగలు ఇళ్లపై ఉండడంతో వర్షా కాలంలో షార్ట్ సర్క్యూట్‌తో గురవుతున్నామని తెలిపారు. ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగి ఇళ్లపై పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో గద్వాల ఉపేందర్ రాయుడు, మంద సాయి, గోపాల్‌దాస్ కృష్ణ, కోల యాకన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం



మాట్లాడుతున్న వేముల భిక్షం

ఆత్మకూరు(ఎం): ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యమని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. శుక్రవారం మండలంలోని కూరెళ్లలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ నిరంతరం ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతుందన్నారు. విచ్చలవిడిగా డబ్బులు, మద్యం పంపిణీ చేసి ఎన్నికల్లో గెలిచారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగామన్నారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మలగూడెం యాదయ్య, నాయకులు మర్రిపల్లి మల్లయ్య, భాషబోయిన ఐలయ్య, పొన్నం అండాలు, కప్పల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వైకుంఠధామం పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పీవైఎల్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో వైకుంఠధామం పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) కార్యదర్శి పగుడాల శివ అన్నారు. పట్టణ పరిధిలో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం పనులను శుక్రవారం పీవైఎస్ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా వైకుంఠధామం పూర్తి చేయకపోవడంతో అంత్యక్రియలు చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, అశోక్, సాయి, గణేశ్, శివ పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని టి. రేపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు మూల ఆదినారాయణ గౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. బీఆర్ఎస్ ప్రమాద బీమా నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును శుక్రవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, గడ్డమీది రమేష్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు యాస అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సమాయత్తం

- ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనులు
- భూదాన్‌పోచంపల్లిలో 28 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ముక్తాపూర్‌లో వరినారు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలో వానకాలం పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే రైతులు దుక్కులు దున్నించి నారుమడులను సిద్ధం చేసి నార్లు పోశారు. మరికొందరూ రైతులు నార్లు పోసేపనుల్లో నిమగ్నమయ్యారు. రోహిణికార్తెలో పోసిన నార్లు ఏపుగా పెరిగింది. మరో 10–15 రోజుల్లో నాట్లు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నిస్తూ, కంపోస్ట్ ఎరువులను చల్లుతూ నాట్లు వేయడానికి పంట పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

28,500 ఎకరాలలో..

వానాకాలంలో మండల వ్యాప్తంగా 28,500 ఎకరాలలో వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉంటే మండలంలో సాగునీటి వనరులు సమృద్ధిగా ఉన్నాయి. ముఖ్యంగా మూసీ నది, పిలాయిపల్లి కాలువ, చెరువులు, కుంటలు, వ్యవసాయ బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నారు. దీంతో ప్రతి ఏటా వరిసాగు గణనీయంగా పెరుగుతూ వస్తుంది. గత నాలుగేళ్లలో వరిసాగు 18 వేల నుంచి 28వేల ఎకరాల వరకు పెరిగింది. గత యాసంగిలో 27వేల ఎకరాల వరిసాగు చేయగా, ఈ వానాకాలంలో 1500 ఎకరాలకు వరిసాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వరితో పాటు మండలంలో 200 ఎకరాలలో కూరగాయలు, 300 ఎకరాలలో పత్తి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనాలను రూపొందించారు.

అందుబాటులో ఎరువులు

వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచింది. వరి వివిధ రకాల పత్తి విత్తనాల ప్యాకెట్లను వ్యవసాయాధికారులు ఆయా మండల కేంద్రాల్లోని పీఏసీఎస్ కేంద్రాల్లో, ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. సాగు ప్రణాళిక అనుగుణంగా వ్యవసాయాధికారులు పీఏసీఎస్‌లు, మన గ్రోమోర్, లైసెన్స్‌డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. 180 మెట్రిక్ టన్నుల యూరియా, 120 మెట్రిక్ టన్నుల డీఏపీ, 220 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, జింక్ సల్ఫేట్ అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు..

రైతులు నాట్లు వేసుకొనేటప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నాట్లు వేసుకొనేటప్పుడు వరికొనలు తుంచి నాట్లు వేసుకొంటే నటపిప్పి, ఉల్లికోడు, నామాల పురుగు, రసం పీల్చు పురుగు నుంచి కాపాడుకోవచ్చని..అలాగే నారుపోసిన 25 రోజుల్లోనే నాట్లు వేసుకొంటే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. మూసీ పరివాహకంలో ఎకరానికి ఒక డీఏపీ బస్తా వేసుకుంటే సరిపోతుందని, అలాగే చౌడునేలలో సాగుచేసే రైతులు ఎకరానికి 30 నుంచి 40కిలోల జింక్ సల్ఫేట్ వాడాలని సూచిస్తున్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం



రైతులు లైసెన్స్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదును జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. మండలంలో వానాకాలంలో 28,500 ఎకరాల వరిసాగవుతుందని అంచనా వేసి అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాం. వరినార్లు పోసుకొన్న రైతులు తప్పనిసరిగా 25 రోజుల్లోనే నాట్లు వేసుకోవాలి. దాంతో పంట దిగుబడి బాగా వస్తుంది. అంతేకాక నాట్లు వేసేటప్పుడు నారు కొనలు విరిచి నాట్లు వేసుకొంటే వరికి ఆశించే చీడపీడలను నుంచి రక్షించుకోవచ్చు.

– ఏజాజ్ అలీఖాన్, ఏఓ, భూదాన్‌పోచంపల్లి

చెరువు ఆక్రమణలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న హన్మంత్

రామన్నపేట : రామన్నపేట పెద్దచెరువు ఆక్రమణలను అరికట్టాలని రామన్నపేట మత్స్యకార్మిక సహకార సంఘం అధ్యక్షుడు కందుల హన్మంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆవరణలో జరిగిన మత్స్య కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువుశిఖం భూముల పక్కనగల రైతులు చెరువును కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెరువు హద్దులను గుర్తించి ఫెన్సింగ్ వేయించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 10న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి పిట్టల మత్స్యగిరి, యాట ఇస్తారి, బొళ్ల చినవెంకన్న, రేపాక పోచమ్మ, యాట భాగ్యమ్మ, బొళ్ల వెంకటేశ్వర్లు, కందుల లలిత, లక్ష్మమ్మ, భాగ్యమ్మ యాట అనసూయ, జినుకల చినమల్లయ్య, కేశబోయిన ఇందిరమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర



కరపత్రం ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వలిగొండ : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 10 వ తేదీన హైదరాబాద్ లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం నిర్వహించే సదస్సులో ప్రతిఒక్కరూ పాల్గొని సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి , రాజ్య సభ సభ్యులు శివదాసన్ , జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ వక్తలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాల్కురి రాం చెందర్, కండకట్ల సాయి, కొండూరు సత్తయ్య, గండికోట నర్సింహ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భువనగిరి : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భువనగిరి : మోత్కూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని వెల్లంకి ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1977–78 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇటీవల ట్రాన్స్‌కో డీఈగా ఉద్యోగ విరమణ పొందిన మిత్రుడు వనం అశోక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సత్తిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు మోటె సత్తయ్య, కొంగరి జానయ్య, ఎడ్ల చంద్రయ్య, వనం యాదగిరి, పాశం యాదిరెడ్డి, చింతపల్లి నర్సిరెడ్డి, వసంతరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, పున్న రాధాకృష్ణ, వీరాచారి, కొంగరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రామన్నపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలి



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

బొమ్మలరామారం : ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని ఇంటర్నల్ స్క్వాడ్ టీమ్ సభ్యులు ఫర్టిలైజర్ దుకాణ యజమానులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని చీకటి మామిడి, మర్యాల గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. తనిఖీల్లో భువనగిరి వ్యవసాయ సంచాలకులు దేవ్‌సింగ్, పోచంపల్లి, వలిగొండ, బొమ్మలరామారం ఏఓలు ఏకే ఖాన్, అంజని, పద్మ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చామల కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసిన నాయకులు



మోత్కూరు : చామల కిరణ్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మోత్కూరు : భువనగిరి ఎంపీగా గెలు పొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మోత్కూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదారాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, వంగాల సత్యనారాయణ, ఎగమాటి రామ్‌రెడ్డి, గోరుపల్లి సంతోష్‌రెడ్డి, పైళ్ల నర్సిరెడ్డి, కారుపోతుల వెంకట్ గౌడ్, పురుగుల నర్సింహ్మ, తండ సత్తయ్య, శ్రీనివాస్, సమీర్, గనగాని అనిల్, తీగల నర్సింహ్మరెడ్డి, గడ్డం లక్ష్మణ్, జినుకల కనకయ్య, ఎర్రబెల్లి యాదయ్య, కస్తూరి వీరస్వామి, నాయిని ప్రవీణ్‌కుమార్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : భువనగిరి ఎంపీగా గెలిచిన చామల కిరణ్‌కుమార్ రెడ్డిని శుక్రవారం స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, దయాకర్‌డరెడ్డి, పనుమటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా..



బురదమయంగా మారిన వంకమామిడి - శేరిల్ల రోడ్డు



కంకరతేలిన రోడ్డు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని వంకమామిడి–శేరిల్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారింది. బురదమయంగా ఈ రోడ్డుపై ఆయా ప్రాంతాల్లోని గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌటుప్పల్‌కు వెళ్లడానికి జిబ్లక్‌పల్లి, దోతిగూడెం గ్రామాల మీదుగా 7 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. వంకమామిడి, శేరిల్లా రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, దంతూర్ గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- జెడ్పీ సీఈఓ శోభారాణి

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. శుక్రవారం దుబ్బాక గ్రామంలో నిర్వహించిన బడిబాట ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుకు ఉచిత విద్య, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కూలు యూనిఫామ్‌ను అందించడం జరుగుతుందన్నారు. ఆమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో అవసరమైన మౌళిక వసతులను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్, మండల నోడల్ అధికారి గవ్వా జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు ఉయ్యాల భిక్షం, తుమ్మల పల్లవి పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకందుకూరులో..

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని పెద్దకందుకూరు, చొల్లేరు, వంగపల్లి, మాసాయిపేట, బాహుపేట, చిన్నకందుకూరు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బడి బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరిశంకర్, జానకి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ముక్తాపూర్‌లో..

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు పిల్లలకు ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలు కల్పించబడుతాయని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇ.శ్రీనివాస్‌రెడ్డి, సంధ్యారాణి, కంచెనపల్లి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



రామన్నపేట : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ శోభారాణి

ఆత్మకూరు(ఎం)లో..

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ కల్పిస్తున్న వసతులను, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఉన్న వ్యత్యాసాలను తల్లిదండ్రులను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. అరవిందరాయిడు, కట్టా రమేష్, వై. పద్మారెడ్డి, రాధిక, విజయ, చిత్తరంజన్, నర్సయ్య పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరు రూరల్): బడీడు పిల్లలని బడిలో చేర్పించాలని ఆలేరు ఎంపీడీఓ సత్య ఆంజనేయ ప్రసాద్ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. పాఠశాలలో చేపట్టిన పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీ ప్రధానోపాధ్యాయులు శ్యామ సుందరి, రామ చంద్రయ్య, ఏపీఎమ్ మీనా, ఏఎమ్‌సీ చైర్మన్‌లు సంతోష, మాధవి, జ్యోతి, కవిత, పద్మ, ఉపాధ్యాయులు జ్యోతిరాజు, రాములు, శ్రీనివాస్, సరోజ, విద్యావతి, వేణుగోపాల్, చైతన్య, తిరుపతి, శ్రీనివాస్ పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మోత్కూరు : బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మోత్కూరులో..

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వడ్డెర కాలనీలో ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనంలో వారానికి 3 కోడి గ్రుడ్లు, ఉచిత దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందించనున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కె.సౌజన్య, బి.లలిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు వి.పద్మ, జహంగీర్, ప్రధానోపాధ్యాయురాలు డి.భార్గవి, ఉపాధ్యాయులు నర్సింగ్ రావు, శ్రీరాములు, సత్తయ్య, వెంకటయ్య, రాజేంద్రప్రసాద్, రవి, డివి.రావు, నర్సింహ, రమాదేవి, మంగమ్మ, శ్వేత, కిరణ్, యాదయ్య, శ్రీనివాస్, నవీన్, మోహన్‌రెడ్డి, శ్రీరాములు, అనిత, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట రూరల్: పెద్దకందుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



భూదాన్‌పోచంపల్లి : బాటబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



చౌటుప్పల్ : తంగడపల్లిలో బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

పంట నష్టపరిహారం విడుదల చేయాలి

భువనగిరి రూరల్ : రైతులకు పంట నష్టపరిహారాన్ని విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్యభవన్‌లో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వానాకాలం రైతులకు విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని, పత్తి విత్తనాలు కూడా దొరకడంలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, పల్లెర్ల అంజయ్య, కొండ అశోక్, ఏదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, సిలివేరు ఎల్లయ్య, ఎల్లంల వెంకటేశం, జిట్ట అంజిరెడ్డి, వెంకటేశ్, యాదగిరి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి

ఆత్మకూరు(ఎం) : టీబీ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేసి క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని మండల వైద్యాధికారి విలియం కేరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. టీబీ టీకాతో ఎటువంటి చెడు ఫలితాలు ఉండవన్నారు. 0.1ఎంఎల్‌ను చర్మం పొరలోకి కుడిచేతిపై ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కరుణాకర్, సిబ్బంది సాంబులమ్మ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు అడ్డుకట్టేది

- రాయిగిరి–మోత్కూరు స్టేజీ వద్ద తరుచూ జరుగుతున్న ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్
- పట్టించుకోని అధికారులు



ప్రమాదాలకు నిలయంగా మారిన రాయిగిరి - మోత్కూరు రోడ్డు

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై గల రాయిగిరి–మోత్కూరు స్టేజీ ప్రమాదాలకు నిలయంగా మారింది. మోత్కూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు ద్విచక్ర వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేవు. ఆత్మకూరు(ఎం) మండల పరిధిలో మోత్కూరు వైపు , పోసానికుంట నుంచి హైదారాబాద్ వైపు రాయిపల్లి వరకు గల రోడ్డును ఇటీవల నిర్మించడంతో వాహనాల స్పీడుకు అంతు లేకుండా పోయింది. ఆత్మకూరు(ఎం) లోపలి నుంచి మెయిన్ రోడ్డుకు, మోత్కూరు, భువనగిరి నుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తుండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మెయిన్ రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్‌లు లేక పోవడంతోనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి మెయిన్ రోడ్డు స్టేజీకి మోత్కూరు వైపు, భువనగిరి వైపు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు దాటలేక పోతున్నాం



మెయిన్ రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు లేవు. అవతలి వైపు రోడ్డు దాట లేకపోతున్నాం. భువనగిరి, హైదాబాద్ పోవాలంటే అవతలి వైపు వెళ్లి బస్సుల కోసం చూడాల్సి వస్తుంది. వెంటనే స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– శిగ మల్లేశం, ఆత్మకూరు(ఎం)

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ఆత్మకూరు(ఎం) మెయిన్ రోడ్డు స్టేజీ మీద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్‌లు లేక పోవడంతో వాహనాలు వేగంగా వెళుతున్నాయి. స్పీడ్ బ్రేకర్‌ల నిర్మాణం చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని కోరుతున్నాం.

– రవి, సిద్దాపురం